RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 302 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | బుధవారం 23 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

## జూబ్లీహిల్స్ సీఐకి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట..

ఢిల్లీ, సెప్టెంబర్ 22: మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్ వేటు పడిన జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు శ్రీనివాసు రెడ్డిని అరెస్టు చేయవద్దని లేదా అతడిపై ఎలాంట బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.మంగళవారం ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

## హైదరాబాద్ పాలనలో బిగ్ చేంజ్.. క్యూర్ బిల్లుకు గవర్నర్ ఆమోదం

**హైదరాబాద్, సెప్టెంబర్, 22:** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో సమర్థవంతమైన పాలన, డిజిటల్ ఆధారిత వ్యవస్థగా తీర్చిదిద్దడం దిశగా కీలక అడుగు పడింది. క్యూర్ బిల్లుకు తెలంగాణ గవర్నర్ ఆమోదం తెలిపారు. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లుపై గవ ర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీంతో జీహెచ్ఎంసీ-1955 స్థానంలో క్యూర్ -2026 చట్టం అమల్లోకి రానుంది. ఒకే నగరం.. ఒకే పరిపాలన ఒకే చట్టం లక్ష్యంతో జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీల పరిధిలో వర్తించేలా ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది.

### దేశంలో మళ్లీ ఎల్‌పీజీ కొరత అంటూ వార్తలు..

# కీలక ప్రకటన చేసిన కేంద్రం

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ (వంటగ్యాస్) సిలిండర్ల కొరత ఏర్పడుతుందంటూ సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వార్తలను వస్తున్నాయి. ఈ ఊహాగానాలను కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ తీవ్రంగా స్పందిస్తూ ఖండించారు. గ్యాస్ సిలిండర్ల కొరత భయంతో ఏజెన్సీల వద్ద ప్రజలు క్యూ కట్టాల్సిన అవసరం లేదని, అవాస్తవ ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న ముందస్తు దౌత్య, పరిపాలనా చర్యల వల్ల ముడి చమురు, ఇంధన సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా అధిగమించామని తెలిపారు. మొబైల్‌యాప్‌లద్వారా డిజిటల్ పద్ధతిలో బుక్ చేసుకుంటే 24 గంటల్లోనే సిలిండర్ ఇంటి వద్దకే చేరుతుందని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ఏర్పడిన ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు వ్యూహంతో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని గణనీయంగా పెంచినట్లు కేంద్ర మంత్రి వివరించారు. గతంలో రోజుకు 34 వేల టన్నులుగా ఉన్న దేశీయ వంట గ్యాస్ ఉత్పత్తిని ప్రస్తుతం 55 వేల నుంచి 56 వేల టన్నులకు పెంచామని వెల్లడించారు.



అంతేకాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న 1.07 లక్షల పెట్రోల్ పంపుల్లో ఎక్కడా కూడా ఇంధన కొరత లేదని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా అందుబాటులో ఉన్నాయని తేల్చిచెప్పారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించి బ్లాక్ మార్కెటింగ్ లేదా హోర్డింగ్‌కు పాల్పడే వారిపై నిఘా ఉంచామని, దేశంలో ఇంధన భద్రత పట్ల ప్రజలు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని మంత్రి పునరుద్ఘాటించారు.

### ఆదిలాబాద్ రిమ్స్‌లో అర్ధరాత్రి అగ్నిప్రమాదం..

# ఇద్దరు నవజాత శిశువులు మృతి

ఆదిలాబాద్ :ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కొద్ది సేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు నవజాత శిశువులు మృతి చెందారు. ఇదే వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి దర్యాప్తు తరువాతే ప్రమాదానికి కారణమైన వివరాలను తెలియజేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇక ఈ అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం



చేయాలని సీఎం ఆదేశించారు. మరోవైపు, అగ్ని ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదంలో చిన్నారి మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ప్రార్థించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఘటనా సమయంలో వార్డులో ఉన్న మిగిలిన చిన్నారులందరి పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ సమస్య లేదని అధికారులు మంత్రికి వివరించారు. పిల్లలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు. అగ్ని ప్రమాదానికి గల కారణంపై తక్షణమే విచారణ మొదలు పెట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

### కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు..

# దసరాకు ముందే పంపిణీ!



హైదరాబాద్, సెప్టెంబర్ 22: తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. కొత్త పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

### ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ఘటనపై

# సీఎం రేవంత్‌రెడ్డి విచారం



హైదరాబాద్, సెప్టెంబర్ 22 : ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. చిన్నారుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆస్పత్రుల్లో భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆరా తీశారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మంత్రి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్నారుల కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు. ఈ మేరకు మంత్రి దామోదర్ ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్నారుల కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి ధైర్యం చెప్పారు. ఘటనా సమయంలో వార్డులో ఉన్న మిగిలిన చిన్నారులందరి పరిస్థితి నిలకడగా ఉందని, ఎవరికీ సమస్య లేదని అధికారులు మంత్రికి వివరించారు. పిల్లలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అగ్నిప్రమాదానికి గల కారణంపై తక్షణమే విచారణ ప్రారంభించాలని అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

### వందేమాతరం ఎన్ని చరణాలు పాడాలన్నది

# పౌరుల వ్యక్తిగత నిర్ణయం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 22:** వందేమాతరం గీతాలాపనపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరం ఒక చరణం పాడాలా లేక నాలుగు చరణాలు పాడాలా ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుల వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేసింది. వందేమాతరం 6 చరణాలు ఆలాపనను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేయడంపై ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు టి.ఎం కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్?పై మంగళవారం విచారణ జరిపిన సీజేఐ ధర్మాసనం.. అన్ని చరణాలు పాడని వారిపై శిక్షాత్మక చర్యలు తీసుకోలేరని వ్యాఖ్యానించింది. కేంద్రం విధించే శిక్షాత్మక చర్యల అంశాన్ని పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు.. వందేమాతరం సవరణ చట్టం, మార్గదర్శకాలపై కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని పేర్కొంది. పౌరుల మత విశ్వాసాలకు రాజ్యాంగ రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది.గత 70 ఏళ్లుగా వందేమాతరంలో మొదటి రెండు చరణాలు మాత్రమే ఆలపించే ఆనవాయితీ ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇటీవల మొత్తం ఆరు చరణాల ఆలాపనను తప్పనిసరి చేస్తూ సర్క్యులర్ జారీ చేసింది. అంతేకాకుండా, దీనికి 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా కల్పిస్తూ, ఆలాపనకు అంతరాయం కలిగిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా




చట్టసవరణ తెచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసుడు టి.ఎమ్. కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. చివరి నాలుగు చరణాల్లో నిర్దిష్ట మతపరమైన అంశాలు ఉన్నందున, వాటిని బలవంతంగా పాడించాలని చూడటం రాజ్యాంగం ప్రసాదించిన లౌకికత్వానికి, మతస్వేచ్ఛకు మరియు వ్యక్తిగత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. వందేమాతరం అంశం దేశవ్యాప్తంగా రాజకీయంగానూ హాట్ టాపిక్ గా మారిన వేళ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఆసక్తిగా మారాయి.

### రెండు రాష్ట్రాల మధ్య మీజోక్యం కుదరదు..

# కావేరీ వివాదంలో సుప్రీం కీలక తీర్పు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 22:** కర్ణాటక, తమిళనాడు మధ్య వివాదాస్పద కావేరీ నది జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కర్ణాటకకు 70 టీఎంసీలు అదనంగా కేటాయించాలన్న రిట్ పిటిషన్ ను సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. ప్రైవేట్ సొసైటీల పిటిషన్లు చెల్లవని తీర్పులో స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ -పార్టీలు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని, సొసైటీల పిటిషన్లు విచారిస్తూ పోతే వివాదాలు ముగియవు అని వ్యాఖ్యానించింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక చట్టపరంగా పోరాడుతున్నాయన్న కోర్టు రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని స్పష్టం చేసింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్రాలకే మాట్లాడే హక్కు ఉంటుందన్న




న్యాయస్థానం.. పెండింగ్ లో ఉన్న కావేరి కేసుల దృష్ట్యా కొత్త వ్యాజ్యాలకు తావులేదని తెలిపింది.

### సీఎం రేవంత్ చేతకానితనం వల్లే

# ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదం: కేటీఆర్..



ఆదిలాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు చిన్నారులు మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా విధ్వంసం చేశారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఈ సంఘటనకు ఆయనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు జిల్లా స్థాయి బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారని తెలిపారు. అయినా మొద్దు నిద్ర వీడని రేవంత్ సర్కార్‌లో కనీస చలనం కనిపించలేదన్నారు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని ఆరోపించారు. కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని కేటీఆర్ ఆగ్రహించారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను వెంటనే నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

# అక్రమ అరెస్టులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్, 22:** అరెస్టు చేసిన నిందితులకు అరెస్టుకు సంబంధించిన కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయకపోవడం, వారి తరపున లాయర్‌ను సంప్రదించే అవకాశం ఇవ్వకపోవడం తీవ్ర రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి సందర్భాల్లో నిందితులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించడమే కాకుండా, అక్రమ అరెస్టులపై ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం.. నిందితుడిని అరెస్టు చేసిన 2 గంటల్లోగా మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టాలి. అరెస్టుకు గల కారణాలను నిందితుడికి అర్థమయ్యే భాషలో లిఖితపూర్వకంగా అందించాలి. తనకు నచ్చిన న్యాయవాదిని సంప్రదించే హక్కును కల్పించాలి. ఇవి కేవలం సాంకేతిక విధివిధానాలు కావని, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడే అత్యంత ముఖ్యమైన సూత్రాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# సంపాదకీయం

## యుద్ధ అంచున ప్రపంచం

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. “ఆపరేషన్ ఎపిక్ ఫూరీ” పేరుతో కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హ్సేన్ అమీరాబాద్ డొల్లాహియున్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా, ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా?ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయపడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హార్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది. మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా?ఇజ్రాయిల్? యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా?చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు?ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది. ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. మూలధన ప్రవాహాలు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి. భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. విదేశీ మారక నిల్వల వినియోగం పెరుగుతుంది. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత ప్రశ్నార్థక మవుతుంది. అవసరమైతే వారిని సురక్షితంగా తరలించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఎరువులు, సహజ వాయువు, పెట్రో ధరలను రసాయనాల సరఫరాపై కూడా ప్రభావం పడుతుంది. ఇరాన్ అంతర్గత పరిస్థితులు కూడాఈ సంగ్రామ వాతావరణంతో సంక్లిష్టంగా మారు తున్నాయి. ఆర్థిక ఆంక్షలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొం టున్న దేశానికి సైనిక ఒత్తిడి మరింత భారంగా మారుతుంది.

**పబ్లిషర్ : కొక్కు రవికుమార్**

## ఘనంగా గణపతి హోమం

(ప్రజాగళం,డిచ్ పల్లి):స్థానిక శ్రీకాశీ విశ్వనాథ ఆలయం డిచ్పల్లి ఆర్ఎస్ సార్వజనిక్ గణేష్ మండలి 35వ సం, వార్షికోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలు నిత్వహిస్తున్నారు. మంగళవారం స్వామివారికి మొదకాలతో లడ్డూలతో ఉదయం “లిగణపతి హోమము” “సౌభాగ్య లక్ష్మి వ్రతము జరిగాయి. సాయంత్రము లడ్డువేలము నిర్వహించారు. కార్యములో కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీపీసీసీ చీఫ్ దిగ్భ్రాంతి




ప్రజాగళం,ప్రతినిధి,(హైదరాబాద్) ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రిలో లో ఏసీ యూనిట్ పేలి అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన పై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగి ఇద్దరు చిన్న పిల్లలు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడ్డ పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు.

## ఘనంగా మహాగణపతి హోమం



(ప్రజాగళం,హైదరాబాద్):బేగంబజార్ ఫీల్‌ఖానాలోని వానర సేన గణపతి మండపం వద్ద ‘విశ్వ విజయ్ మిత్ర మండల్’ ఆధ్వర్యంలో సహస్ర మోదక, 51 నారికేళ అష్టద్రవ్య మహాగణపతి హోమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. మండప నిర్వాహకులు సూరజ్ వ్యాస్, హనుమాన్ వ్యాస్, కమల్ పాండేల నేతృత్వంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు, ప్రధాన పూజారి ప్రసాద్ భట్ శిష్యబృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశ స్థాపన, మహాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్, పవన్ పూజారి, మహావీర్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివశంకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రధాన పూజారి ప్రసాద్ భట్, అతిథులు మాట్లాడారు. పరిసర ప్రాంతాల మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఘనంగా గణేష్ ఉత్సవాలు



(ప్రజాగలం,బాచుపల్లి): మండల పరిధిలోని నిజాంపేట్, ప్రగతినగర్ లలో గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా మండపాల నిర్వాహకులు, భక్తులు భక్తీ, శ్రద్దలతో ఘనంగా పూజలు నిర్వహించారు. పెద్దలకు,పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు,ఆటల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. బండారి లేఔట్ రోడ్ నంబర్ 4ఏ లోని అక్షయ క్యాస్టల్ అపార్ట్మెంట్ లో మొదటి సారిగా గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. లడ్డు వేలం పాటలో హన్మంత్ రావు 12,500 దక్కించుకున్నారు. శాంతి,భద్రతలలో భాగంగా స్థానిక పోలీస్ అధికారులు,సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు.

## తె.యూ.గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా డాక్టర్. యల్. జ్యోత్స్న.

నిజామాబాద్ రూరల్ సెప్టెంబర్ 22 (ప్రజాగళం) తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు ఆదేశాల మేరకు గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌గా గతంలో సేవలందించిన డా. జోష్ణను మరోసారి వార్డెన్‌గా నియమిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యం. యాదగిరి మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాలను వార్డెన్ కు అందజేశారు. ఈ పునర్నియామకం పట్ల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు డా. జోష్ణకు అభినందనలు తెలియజేశారు.




# అందరి సహకారంతో ఆర్మూర్ అభివృద్ధి -ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

### మున్సిపల్ నూతన భవనానికి స్థలం పరిశీలన అధికారుల తో సమావేశం



ఆర్మూర్ సెప్టెంబర్ 22 (ప్రజాగళం) పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం నియోజకవర్గ శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి మున్సిపల్. రెవెన్యూ. మార్కెట్ కమిటీ అధికారులతో పాటు పాలకులచే సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణ కొరకు స్థలం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం రు 7.50 కోట్లు మంజూరు చేసిందని అట్టి నిధులతో మూడు ఎకరాల స్థలంలో నూతన మున్సిపల్ భవనం నిర్మాణం చేపడతామని తెలిపారు. మార్కెట్ కమిటీ యొక్క విస్తీర్ణ 11. 9 ఎకరాల భూమి కలదని. ఇట్టి భూమిలో మున్సిపల్ కార్యాలయం తో పాటు మండల రెవెన్యూ కార్యాలయం. మహిళా పోలీస్ స్టేషన్. ట్రాఫిక్ పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని వాటి నిర్మాణ నిధులు మంజూరుకై ప్రభుత్వంకు నివేదిక అందించానని. నిధులు మంజూరు కాగానే మున్సిపల్ కార్యాలయం తో పాటు ఇతర నాలుగు కార్యాలయలు కూడా మార్కెట్ కమిటీ ప్రాంతం లోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ కమిటీ కార్యాలయం శిథిలానికి చేరుకుందని అట్టి మార్కెట్ కార్యలయం కొరకు సర్వే నం 150 లో ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రజల కు అభ్యంతరం ఉంటే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపధాం. నియోజకవర్గ ప్రజల సంక్షేమం. అభివృద్ధి నా లక్ష్యం అని తెలిపారు పట్టణ. మండల ప్రజలు బస్టాండులో దిగిన తర్వాత అందుబాటులో ఉన్న కార్యాలయలకు వెళ్లి పనులు చేయించుకుంటారని ప్రజల సౌకర్యం కొరకు నూతన ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆర్మూర్ బస్టాండ్ ను నూతన కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని. ఉత్తర తెలంగాణ కు ఆదర్శంగా నూతన ఈ వి బస్ డిపో. బస్టాండ్ ఏర్పడు చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలుపు తానని తెలిపారు.

**కేంద్ర నిధుల తో రింగ్ రోడ్**

పట్టణ అభివృద్ధి లో బాగంగా కేంద్ర నిధుల తో ఆర్మూర్ రైల్వే స్టేషన్ నుండి డిచ్ పల్లి రైల్వే స్టేషన్ వరకు రైలు సదుపాయాలు. రింగ్ రోడ్ పనులు అర్గుల్. తొర్లికొండ. బ్రాహ్మన్ పల్లి. గోవింద్ పేట్. లక్కోర. చేపూర్. పల్లె. ఫతేపూర్. పి ప్రి. ఆర్మూర్ వరకు రింగ్ రోడ్ పనులకు ప్రతి పాదన పంపమని. జక్రాన్ పల్లి ఎయిర్ పోర్ట్ పనులు చేపట్టనున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల రైతులు పండించిన పంటలు పట్టణానికి వెళ్లి వ్యాపారం చేసుకోవడానికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ఎమ్మార్వో సత్యనారాయణ. జిల్లా మార్కెట్ అధికారి గంగు బాయి. చైర్మన్ సాయి బాబా గౌడ్. సెక్రటరీ పరమేశ్వర్. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రావు. కౌన్సిలర్ లు. నాయకులు. అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సొసైటీ లో నిధులు అవకతవకలు జరిగాయాన్న పెద్దు లు చేసిన ఆరోపణలు అవాస్తవం....

### తీవ్రంగా ఖండించిన సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి...అభివృద్ధి బాటలో నడుస్తున్న సొసైటీ ని బదనం చేయవద్దు.....




ఎడపల్లి,సెప్టెంబర్ 22: (ప్రజా గళం)ఎడపల్లి మండల కేంద్రంలోని సహకార సంఘం (సొసైటీ)లో నిధులు దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఆరోపణల్లో ఎటువంటి నిజంలేదని,దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి తెలిపారు. ఎడపల్లి సొసైటీ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో అయన మాట్లాడుతూ.. మంగల్ పహాడ్ గ్రామానికి చెందిన మాల పెద్దలు సొసైటీలో నిధులు అవతావకలు జరిగాయాని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేయడం సరైనది కాదని అన్నారు. అయన చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. నిధుల గోల్ మాల్ చేసిన సేల్స్ మెన్ ల నుంచి రికవరీ చేయిస్తున్నామని,కొంత డబ్బు లు రికవరీ చేశామని,ఇంకా వారి నుంచి రికవరీ కావాల్సి ఉందని అయన అన్నారు. తాను సొసైటీ చైర్మన్ గా మొదటిసారి భాద్యతలు తీసుకున్నపుడు వ్యాపారం నష్టాల్లో ఉందని,ఆ తర్వాత పాలకవర్గం సభ్యులు,రైతుల సహకారంతో వారి సూచనలు,సల హాలు పరిగణలోకి తీసుకుని నేడు సొసైటీ అభివృద్ధి దిశలో పయనిస్తోందని అన్నారు. సొసైటీకి ప్రతి ఖర్చు ఉంటుందని,సొసైటీలో పనిచేసే ఉద్యోగ సిబ్బందికి జీత భత్యాలు చెల్లించడం జరుగుతుంది అని అన్నారు. సొసైటీలో నిధులు అవకతవకలు జరిగాయాని ఎదో ఉహించుకొని అధికారులకు ఫిర్యాదు చేసి సొసైటీని బదలం చేయవద్దని సూచించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని,సొసైటీ లో నిధులు అవకతవకలు జరిగినట్లు అనుమానం ఉంటే నేరుగా సొసైటీలో అడిగి తెలుసుకోవాలని అన్నారు. మరొక్క సారి ఇటువంటి అసత్య ఆరోపణలు చేయడం,బాగా నడుస్తున్న సొసైటీని బదలం చేయడం మానుకోవాలని పెద్దులుకు చైర్మన్ మల్కారెడ్డి హితవుపలికారు. ఈ సమావేశంలో సొసైటీ సిఈవో రాజారామ్,డైరెక్టర్ సి హెచ్.నగేష్ గౌడ్,నాయకులు బంజ కామప్ప,రవీందర్ రెడ్డి,దూస గంగాధర్,కృష్ణ రెడ్డి,ఫర్టీ లైజర్ అహ్మద్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

# హున్సా 33/11 కెవి సబ్ స్టేషన్ కు పిఎంకుసుమ్ పథ కం కింద సౌర విద్యుత్ ప్లాంట్ ను ప్రారంభించిన ఎస్ఈ,రాజేశ్వర్ రావు



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 22: (ప్రజా గళం)బోధన్ డివిజన్ పరిధిలోని హున్సా 33/11 కేవీ సబ్‌స్టే షన్‌కు పీఎంకుసుమ్--ఎ పథకం కింద ఏర్పాటు చేసిన మొత్తం 2 మెగావాట్ల 1ఎండబ్ల్యూ o1ఎండబ్ల్యూ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ప్లాంట్‌ను మంగళవారం గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసి టెక్నిక ల్‌గా ఛార్జ్ చేశారు. బోధన్ టౌన్--2 సెక్షన్ పరిధిలోని టాక్లీ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ సౌర విద్యుత్ ప్లాంట్‌ను నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వి.రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, సౌర విద్యుత్‌ను స్థానిక విద్యుత్ వ్యవస్థలోకి అనుసం ధానం చేయడం ద్వారా పునరుత్పాదక ఇంధన విని యోగం పెరగడంతో పాటు, రైతులకు సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా అదనపు ఆదాయ అవకాశాలు లభి స్తాయని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం, సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు భవిష్యత్‌లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను సమ ర్థవంతంగా తీర్చేందుకు టిజి ఎన్ పిడిసిఎల్ చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ,ఎంఆర్ టిసి వెంకటరమణ,అడిఈ,ఎంఆర్ టి టెక్నికల్,మోహ్మద్ ముక్తార్,బోధన్ అసిస్టెంట్ డివిజ నల్ ఇంజనీర్ కె.నాగేష్ కుమార్,ఏడిఈ,హెచ్,బాలచం దర్, బోధన్ టౌన్-2 సెక్షన్ ఏఈ.కళ్యాణ్,టౌన్-1 సెక్షన్ ఏఈ,నాయిని కృష్ణ,సోలార్ ప్లాంట్ రైతులు ఉప్పలపా టి సుబ్బారావు,డాక్టర్. ఉప్పలపాటి శ్రీకాంత్,హున్సా సర్పంచ్ శివకుమార్,ప్రజా ప్రతినిధులు, హుంసా గ్రామ విద్యుత్ వినియోగదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీపీసీసీ చీఫ్ కు శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి.



నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 22 (ప్రజాగళం ) తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా దిగ్విజయంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ ను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షులుగా 2సంవత్సరాలు పదవి పూర్తి చేసుకున్న మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్ లోని వారి నివాసంలో కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట్పల్లి నగేష్ రెడ్డి. మాట్లాడుతూ, ఎన్ ఎస్ యు ఐ కార్యకర్త స్థాయి నుండి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ కు అభినందనలు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పార్టీ పగ్గాలు చేపట్టి పార్టీకి ప్రజల్లో మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. ఇదే స్పూర్తితో వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడం ఖాయమన్నారు. మహేష్ కుమార్ గౌడ్ ఎల్లవేళల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటారని నగేష్ రెడ్డి సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ కు శాలువాతో సన్మానం చేశారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా

# ముందస్తు బైండోవర్ లు

### - జిల్లా వ్యాప్తంగా 572 మంది బైండోవర్.- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడి.

నిజామాబాద్ క్రైమ్ సెప్టెంబర్ 22( ప్రజా గళం ) వినాయక నిమజ్జనం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు , శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందస్తుగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకోవడం జరిగిందని సీపీ వెల్లడించారు. అనంతరం సంబంధిత మండల రెవెన్యూ అధికారులు (తహసీల్దార్ల) ఎదుట హాజరుపరిచి, చట్టపరమైన నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు..వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు , ఘర్షణలు , అల్లర్లు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నితమైన ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, క్రమశిక్షణతో, పరస్పర సహకారంతో వ్యవహరించాలని సీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజల భద్రత,



శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని, వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. నిజామాబాద్ డివిజన్ వ్యాప్తంగా 280 మంది,ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా 175 మంది, బోధన్ డివిజన్ వ్యాప్తంగా 117 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

## మానసిక దివ్యాంగులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి

### మానసిక వైద్య నిపుణులు ఇన్నమూరి రవితేజ.

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 22( ప్రజా గళం ) మానసిక దివ్యాంగులను దేవుడిచ్చిన వరంగా భావించి వారిని తల్లిదండ్రులు ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు ఇన్నమూరి రవితేజ సూచించారు. ఈ మేరకు స్థానిక మారుతి నగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ నిర్వహించే మానసిక దివ్యాంగుల పాఠశాల తల్లిదండ్రుల సమావేశము మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇన్నమూరి రవితేజ ముఖ్య అతిథిగా హాజరై తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక దివ్యాంగులు తల్లిదండ్రులకు దేవుడిచ్చిన ప్రసాదమని వారిని జాగ్రత్తగా పెంచి, ఉపయోగకర పౌరులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. మానసిక దివ్యాంగులను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుందని వారు సరియైన దిశలో పిల్లల కోసం సమయాన్ని కేటాయించినట్లయితే వారిని ఉపయోగకర పౌరులుగా మార్చడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి తల్లిదండ్రులు వారి దివ్యాంగ పిల్లల సమస్యలను గుర్తించి వాటిని క్రమ పద్ధతిలో ఒక పేపర్ పై రాసుకొని వాటిలో చిన్న సమస్యలను ముందుగా తీసుకొని ఆ సమస్యలను దూరం చేయడంలో వారికి కావలసిన సహాయాన్ని అందించాలని దీనివల్ల పిల్లల్లో ప్రవర్తన పరమైన సమస్యలు దూరం అవుతాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క తల్లి వారి దివ్యాంగ పిల్లల కొరకు ఏబీసీ పాటర్న్ లో ప్రవర్తనను మార్చవచ్చని పిల్లవాడు ప్రవర్తన కంటే ముందు జరిగిన అంశాలను, ప్రవర్తన తర్వాత జరిగిన పరిణామాలను




దృష్టిలో పెట్టుకొని పిల్లలను పెంచుకోవాలని కోరారు. అధ్యక్షత వహించిన స్నేహ సొసైటీ కార్యదర్శి స్నేహ సొసైటీ మానసిక దివ్యాంగుల కోసం అందిస్తున్న సేవలను, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఏర్పాటు చేయవలసిన లోకల్ ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో మానసిక దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు పని చేస్తుందని తెలిపారు. పాత కమిటీలో బాబా గౌడ్ చైర్మన్గా, జగదంబరావు వైస్ చైర్మన్గా, ఎన్ లక్ష్మి టీచర్ కన్వీనర్ గా, పేరెంట్స్ సూర్య ప్రకాష్ మరియు ఆస్మాలు కమిటీ సభ్యులుగాఉన్నారు. వీరి పదవీకాలం ముగియడంతో నూతన కమిటీ సభ్యులుగా బ్రహ్మానంద రెడ్డి చైర్మన్గా రామ్ సుజన్ వైస్ చైర్మన్ గా ఇంద్రాణి టీచర్ కన్వీనర్ గా పేరెంట్స్ భాగ్యలక్ష్మి, బ్రహ్మయ్యలు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంధుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ జ్యోతి, మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య,మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు. దివ్యాంగులు పాల్గొన్నారు.

## అనుమతులు నిల్.. నిర్మాణం ఫుల్.. అధికారుల మీనమేషాలు.



ఆర్మూర్, సెప్టెంబర్ 22(జనంసాక్షి):ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో అక్రమ ఇంటి నిర్మాణం జోరుగా కొనసాగుతుంది.గతంలో నిర్మించిన ఇంటి నిర్మాణంపై మొదటి అంతస్తు కొత్త ఇంటి నిర్మాణం జరుపుతున్నారు.అదే విధంగా రోడ్డు భాగాన్ని ఆక్రమిస్తూ కమర్షియల్ షటర్ల నిర్మాణం యదేచ్చగా జరుపుతున్నారు.మున్సిపల్ చట్టం ప్రకారం ఒక ఇంటి నిర్మాణం జరపాలంటే టీఎస్ బి పాస్ లో అప్లై చేసుకోవాలి. క్రింది అంతస్తు ఇంతకుముందే నిర్మాణం జరిగి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న మొదటి అంతస్తు నిర్మాణంతోపాటు ఇంటి మొత్తానికి పర్మిషన్ తీసుకోవాలి. మున్సిపల్ అధికారులు సైతం ఆ ఇంటి నిర్మాణం పై ఏలాంటి అనుమతులు ఉన్నాయో చూడకుండా వ్యవహరిస్తున్నారు. పిప్రి మార్గం వెళ్ళే రోడ్డు దారిలో నిర్మాణం జరుగుతున్న అధికారులు చలనం లేకుండా ఉంది. ఇకనైనా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి.


### అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 22( ప్రజాగళం )మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల డిమాండ్ చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో కాంట్రాక్ట్,అవుట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు, లైన్మెన్లు, పారిశుద్ధ్య కార్మికులు, డ్రైవర్లు, వాటర్ సెక్షన్ సిబ్బంది గత ఐదు రోజులుగా ధర్నా చౌక్లో చేపట్టిన సమ్మెకు నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హాజరై తన పూర్తి మద్దతును ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులు తన కుటుంబ సభ్యులతో సమానమని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే జీవో 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న 19,500 వేతనాన్ని పెంచి, కనీస వేతనంగా ?26,000 అందించాలని కోరారు.ప్రతి నెలా 1వ తేదీ నుండి 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, రాత్రి వేళల్లో విధి నిర్వహణలో ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కార్పొరేషన్ నుండి ఐడెంటిటీ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే వారి అంత్యక్రియల కోసం ?20,000 తక్షణ సాయం అందించాలని, అలాగే మృతుల కుటుంబ సభ్యులకు (వయోపరిమితి సడలించి) ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.వినాయక చవితి ఉత్సవాల వేళ వీధిదీపాలు వెలగక నగరం అంధకారంలోకి వెళ్లే పరిస్థితి



వచ్చిందని, దీనివల్ల ప్రజలకు మరియు శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని గుర్తుచేశారు.ప్రాణాలకు తెగించి కోవిడ్ సమయంలో సేవలు అందించిన మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం దయతో వ్యవహరించాలని, కార్మికుల సమ్మె వల్ల నగరంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను తీర్చాలని కోరారు.కార్మికులు కోరుతున్న డిమాండ్లు న్యాయమైనవని, అధికారులు మరియు ప్రభుత్వం వెంటనే స్పందించి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లు చర్చలు జరిపి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గణేష్ బిగాల డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సత్య ప్రకాష్ నవీద్ ఇక్బాల్,జగత్ రెడ్డి,అబ్దుల్ మతీన్ తదితరులు పాల్గొన్నారు.

## 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..



ఏలూరు, : ఆంధ్రప్రదేశ్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది.ఆంధ్రప్రదేశ్లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.ఖరీఫ్ సీజన్లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

## థిస్సెన్క్రుప్తో భెల్ కీలక ఒప్పందం


హరిత హైడ్రోజన్ ఉత్పత్తి సాంకేతికతను దేశీయంగా అందుబాటులోకి తెచ్చేందుకు భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (భెల్), జర్మనీకి చెందిన హైడ్రోజన్ టెక్నాలజీ సంస్థ థిస్సెన్క్రుప్ నుసెరా ఇండియాలు కీలక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. నీటి నుంచి హరిత హైడ్రోజన్ను వేరు చేసేందుకు ఉపయోగించే అత్యాధునిక 'ఆల్కలైన్ వాటర్ ఎలక్ట్రోలైజర్' వ్యవస్థల దేశీయ తయారీ, దశలవారీగా స్వదేశీకరణ లక్ష్యంగా ఈ రెండు సంస్థలూ చేతులు కలిపాయి. హైదరాబాద్ రామచంద్రాపురంలో ఉన్న భెల్ భారీ విద్యుత్ పరికరాల ప్లాంట్ (హెచ్పీఈపీ)లో వీటిని తయారు చేయనున్నట్లు సమాచారం. ఈ సరికొత్త భాగస్వామ్యం ద్వారా దశలవారీగా హైదరాబాద్ ప్లాంట్కు దాదాపు రూ.10,000 కోట్ల వరకూ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా. దిల్లీలోని భెల్ కార్యాలయంలో హైదరాబాద్ హెచ్పీఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, థిస్సెన్క్రుప్ నుసెరా ఇండియా సీఈఓ కిరణ్ జోసెఫ్ తదితరులు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. తద్వారా దేశీయంగా రానున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల టెండర్లలో ఉమ్మడిగా పాల్గొనాలని ఇరు సంస్థలూ నిర్ణయించాయి. భారత గ్రీన్ హైడ్రోజన్మార్కెట్లో థిస్సెన్క్రుప్ నుసెరా వరుసగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగానే ఈ ఒప్పందం కుదిరింది. దేశీయ డెవలపర్ జునో జౌల్కు చెందిన 260 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు సంబంధించి అధ్యయన కాంట్రాక్టునూ ఈ సంస్థ దక్కించుకుంది.

## మెటాకు ఏకంగా రూ.120 లక్షల కోట్ల జరిమానా?




సోషల్ మీడియా దిగ్గజం, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ల మాతృసంస్థ 'మెటా' (ఓవబిజీ) ప్రపంచ కార్పొరేట్ చరిత్రలోనే ఎన్నడూ ఎరుగని భారీ సంక్షోభంలో పడింది. పిల్లలను తమ యాప్స్కు బానిసలుగా మార్చారనే తీవ్ర ఆరోపణలపై అమెరికాలోని నాలుగు రాష్ట్రాలు మెటా సంస్థపై ఏకంగా 1.4 ట్రిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 120 లక్షల కోట్లు) జరిమానా విధించాలని కోర్టును ఆశ్రయించాయి. టెక్నాలజీ ఇండస్ట్రీ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో పెనాల్టీ డిమాండ్ చేయడం ఇదే తొలిసారి అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. ప్రస్తుతం మెటా సంస్థ మొత్తం మార్కెట్ విలువే 1.5 ట్రిలియన్ డాలర్లు కాగా, అందులో దాదాపు 90 శాతం కంటే ఎక్కువ మొత్తాన్ని జరిమానా రూపంలో డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసు విచారణ ఆగస్టులో కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టులో జరగనుంది. ఇది కేవలం అకౌంట్ హ్యాకింగ్ లేదా డేటా లీక్కు సంబంధించిన సాధారణ కేసు కాదు. పిల్లలు, టీనేజర్ల మానసిక జీవితాలతో ఆడుకున్నారనేది ప్రధాన ఆరోపణ. కాలిఫోర్నియా, కొలరాడో, కెంటుకీ, న్యూజెర్సీ రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం.. పిల్లలు, యువత ఇన్స్టాగ్రామ్, ఫేస్బుక్ యాప్ల నుంచి బయటకు రాకుండా, ఎక్కువ సమయం స్క్రీన్లకే అతుక్కుపోయేలా మెటా సంస్థ తన అల్గారిథమ్లను ఉద్దేశపూర్వకంగా డిజైన్ చేసింది. తమ ప్లాట్ఫారమ్లు చాలా సురక్షితమైనవని మెటా బయటకు నమ్మబలికింది. కానీ, అంతర్గతంగా ఈ యాప్స్ వల్ల పిల్లలకు జరుగుతున్న నష్టంపై కంపెనీకి ముందే పూర్తి సమాచారం ఉందని ఈ రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. ఎండ్లెస్ స్క్రోలింగ్ ఫీడ్, నోటిఫికేషన్ అలర్ట్స్, లైక్ సిస్టమ్, రికమెండేషన్ అల్గారిథమ్స్ వంటివన్నీ పిల్లలను అడిక్ట్ చేయడానికే పెట్టారని పిటిషన్లో పేర్కొన్నారు. దీనివల్ల లక్షలాది మంది పిల్లల్లో తీవ్ర ఆందోళన (ఒనిలీతివబిఎ), డిప్రెషన్, నిద్రలేమి, సోషల్ మీడియా వ్యసనం వంటి మానసిక సమస్యలు పెరిగాయని మండిపడ్డారు. ప్రస్తుతం ఈ 4 రాష్ట్రాలతో పాటు మరో 14 రాష్ట్రాలు కూడా మెటాపై విడివిడిగా చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నాయి. ఈ రూ.120 లక్షల కోట్ల భారీ పెనాల్టీ డిమాండ్ను మెటా తీవ్రంగా ఖండించింది. సోషల్ మీడియా అడిక్షన్ అనేది అధికారికంగా ఎలాంటి మానసిక వ్యాధి కాదని, తాము కావాలనే లూప్స్ క్రియేట్ చేశామనడం అబద్ధమని వాదించింది.

## పూర్తి భారతీయ కంపెనీగా స్విగ్గీ





ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్ఫామ్ స్విగ్గీ సరికొత్త మైలురాయిని అందుకుంది. స్టాక్ ఎక్స్ఛేంజ్లకు సమర్పించిన నివేదిక ప్రకారం, జూలై 6 నాటికి స్విగ్గీలో విదేశీ పెట్టుబడులు 49.76 శాతానికి తగ్గగా, దేశీయ ఇన్వెస్టర్ల వాటా 50.24 శాతానికి పెరిగింది. దీంతో స్విగ్గీ అధికారికంగా 'భారతీయ యాజమాన్య సంస్థ'గా అవతరించింది. అయితే, కంపెనీ ఆశిస్తున్న పూర్తి స్థాయి 'భారతీయ యాజమాన్యం, నియంత్రణలో ఉన్న సంస్థ' (ఐఓసీసీ) హోదాను సాధించడానికి మాత్రం ఇంకా ఒక అడుగు దూరంలో నిలిచింది. ఈ హోదా కోసం మే నెలలో జరిగిన వాటాదారుల ఓటింగ్లో 'ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్' సవరణకు 75 శాతం మెజారిటీ అవసరం కాగా, కేవలం 72.36 శాతం మద్దతు మాత్రమే లభించడంతో ఆ ప్రతిపాదన వీగిపోయింది. ప్రస్తుత వాటాల మార్పు వల్ల కంపెనీ నిర్వహణ, వ్యాపార కార్యకలాపాలు లేదా బోర్డు ఓటింగ్ హక్కులలో ఎలాంటి తక్షణ మార్పులు ఉండబోవని స్విగ్గీ స్పష్టం చేసింది. స్విగ్గీకి ఐఓసీసీ హోదా వ్యూహాత్మకంగా ఎంతో కీలకం.

## వక్ఫ్‌లో అవినీతిని ప్రశ్నించరెందుకు: యోగి

యుపి: అయోధ్య రామాలయ విరాళాల కేసు ఆధారంగా సనాతన ధర్మంపై దాడి చేస్తున్న విపక్షాలు... వక్ఫ్ విషయంలో మాత్రం నోరు తెరవటం లేదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విమర్శించారు. వక్ఫ్‌కు సంబంధించిన విషయాలపై ప్రతిపక్షాల నోళ్లకు తాళాలు ఎందుకు పడతాయని ప్రశ్నించారు. “సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు ఊసరవెల్లికన్నా వేగంగా రంగులు మారుస్తున్నాయి. రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించిన పార్టీలు ఇప్పుడు అయోధ్యలో మత విశ్వాసాలకు విఘాతం కలిగిందని అంటున్నాయి.



# అందుకే ఆమిర్‌ను గమనించలేదు...



బాలీవుడ్ కథానాయకప్రీతి జింటా, ఆమిర్ ఖాన్‌ను పట్టించుకోలేదనే వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ వీడియోపై ప్రీతి జింటా స్పందిస్తూ.. "క్లిక్‌బైట్ కోసం ఇలాంటి పనులు చేయడం మంచిది కాదు. నేను లోపల కొన్ని షాట్స్ షూట్ చేయాలనే తొందరలో, అలాగే 'బట్వారా 1947' ప్రమోషన్స్ కోసం ఫ్లైట్ అందుకోవాలనే కంగారులో ఉన్నాను. అందుకే ఆమిర్‌ను గమనించలేదు. ఒకవేళ మీ ఉద్దేశం ఏదైనా ప్రతికూలతను ప్రచారం చేయడమే అయితే ఇకపై నేను ఆగి ఫొటోలు దిగుతానని మాత్రం ఆశించవద్దు. ఆమిర్ పట్ల నాకు ఎంతో ప్రేమ, గౌరవం ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ప్రచారం చేయడం మంచి పద్ధతి కాద"ని ఆమె అన్నారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రం 'బట్వారా 1947'. సన్నీ దేఓల్ ప్రధాన పాత్రలోనటించారు. రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహించా రు. ప్రీతిజింటా, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషిం చారు.ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ సినీప్రియుల్ని ఆక ట్టుకుంది.

# 'ఆంథ్రో డ్రీమ్స్' ప్రత్యేక ప్రదర్శన...



చిత్ర దర్శకురాలు మీన లాంగ్‌జామ్ రూపొందించిన 'ఆంద్రో డ్రీమ్స్' డాక్యుమెంటరీ ప్రత్యేక ప్రదర్శనను హైదరాబాద్‌లో నిర్వహించారు. మహిళా ఫొటోగ్రాఫర్లు, విజువల్ స్టోరీటెల్లర్స్ కోసం ఏర్పాటైన హర్‌ఫోకస్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో, షెపర్డ్స్ స్టోరీస్ సాంస్కృతిక వేదిక సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. హర్‌ఫోకస్‌ను స్పందన కోటేశ్వరమ్మ, కీర్తి సంగు, హృదయ పణుగటి, ప్రేరికా ఎం కలిసి స్థాపించారు.మణిపూర్‌లోని ఆంద్రో గ్రామానికి చెందిన 66 ఏళ్ల లైబీ అనే మహిళ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల ఫుట్‌బాల్‌కు అందించిన ప్రోత్సాహం, ఆమె ప్రయాణం చుట్టూ ఈ డాక్యుమెంటరీ కథ సాగుతుంది. సినిమా ద్వారా మహిళల సంకల్పం, దర్శకురాలు ఆవిష్కరించారు. ప్రదర్శన అనంతరం మీన లాంగ్‌జామ్ ప్రేక్షకులతో ముచ్చటిస్తూ డాక్యుమెంటరీ రూపకల్పన, ఆంద్రో గ్రామం నేపథ్యం, చిత్రంలోని పాత్రల అనుభవాలు, సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. మహిళల కథలను, ప్రాంతీయ సంస్కృతులను, విభిన్న జీవిత అనుభవాలను డాక్యుమెంట్ చేసి వాటిని విస్తృత ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో హర్‌ఫోకస్ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

# మాలో ఛాన్స్ కొట్టేసిన మీనాక్షి చౌదరి?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో ప్రస్తుతం 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో మోస్ట్ బ్యూటిఫుల్ నటి మీనాక్షి చౌదరి భాగం కాబోతున్నట్లు, ప్రస్తుతం ఆమెతో మేకర్స్ మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మీనాక్షి ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రలో కాకుండా ఓ గెస్ట్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.

ఆమెకు సంబంధించిన సన్నివేశాలు సెకండాఫ్‌లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఈ సినిమాలో అసలు హీరోయిన్ పాత్ర ఉంటుందా? లేదా? అనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో నెలకొంది. ఎస్ఎస్ తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం.

# ఆ సంఘటనతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా



ప్రముఖ హిందీ నటుడు గోవిందా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇప్పటివరకు ఎన్నో చిత్రాల్లో అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన.. ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న గోవిందా.. తన జీవితంలో ఎదురైన విషాద సంఘటన గురించి, ఆ ఘటన తనపై ఎలాంటి ప్రభావం చూపిందో వివరించారు. గోవిందా మాట్లాడుతూ.. 1996లో తన తల్లి నిర్మలా దేవి మరణించారని, ఆమె మృతితో తాను తీవ్రంగా కృంగిపోయానని తెలిపారు. ఆమె లేని జీవితాన్ని ఎలా కొనసాగించాలో అర్థం కాక, జీవితంపై విరక్తి కలిగిందని చెప్పుకొచ్చారు. ఆ బాధను తట్టుకోలేక ఒకానొక దశలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించినట్లు వెల్లడించారు. అమ్మ మరణాన్ని తట్టుకోలేక చనిపోవాలని నర్మదా నది దగ్గరకు వెళ్లాను. నదిలోకి వెళ్తుండగా ఓ సాధువు నన్ను అడ్డుకున్నారు. ఆ సమయంలో నేను ఏం చేస్తున్నానో నాకు అర్థమైంది. నా పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకున్నాను. మా తల్లి మరణించిన 10-15 రోజులకు ఆ ఆలోచన నుంచి పూర్తిగా బయటపడ్డానని గోవిందా తెలిపారు. ప్రస్తుతం గోవిందా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు ప్రతి క్షణం ఎంతో భయంగా ఉండేది



టాలీవుడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమ జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు తాను అనుభవించిన టాక్సిక్ రిలేషన్‌షిప్, ఎదుర్కొన్న మానసిక వేదన గురించి చెప్తూ ఎమోషనల్ అయ్యారు. ఆ బంధంలో ఉన్నంత కాలం ప్రతి క్షణం భయంతోనే బతికానని ఆమె తెలిపారు. ఆ రిలేషన్‌లో ఉన్నప్పుడు కనీసం తన సాధారణ పనులు కూడా ప్రశాంతంగా చేసుకోలేకపోయేదాన్ని అని చెప్పారు. ఏదైనా మాట్లాడే ముందు ఎదుటి వ్యక్తి ఎలా స్పందిస్తారో అని మనసులోనే వందసార్లు ప్రాక్టీస్ చేసుకోవాల్సి వచ్చేదని, ప్రతిరోజూ ఒక అనిశ్చితి భయం తనను వెంటాడేదని పేర్కొన్నారు. మనకు తెలియకుండానే చాలా నెమ్మదిగా, నిశ్శబ్దంగా ఆ భయాందోళన లోకి నెట్టబడతామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన మాజీ ప్రియుడి వల్ల తాను ఎన్నో మంచి సినిమా ప్రాజెక్ట్‌లను వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. తన ప్రతి విషయంలోనూ అతడు ప్రత్యక్షంగా, పరోక్షంగా జోక్యం చేసుకునేవాడని తెలిపారు. క్రమంగా తన కుటుంబానికి, స్నేహితులకు తనను పూర్తిగా దూరం చేశాడని అన్నారు. బయటకు వచ్చినప్పుడు ఎవరైనా చూసి ఎలా ఉన్నావు అని ప్రేమగా అడిగితే ఎక్కడ ఏడ్చేస్తానో అని భయపడేదాన్ని అని చెప్పారు. ఎదుటి వ్యక్తి తనకు ఎంత హాని చేస్తున్నా, తన ఎదుగుదలను ఎలా అడ్డుకుంటున్నా ఒకానొక దశలో తన సొంత కుటుంబం నుంచే అతడిని కాపాడుతూ వచ్చానని ఆమె గుర్తు చేసుకున్నారు. అతడి ప్రవర్తన వల్ల చివరకు తన ఆత్మీయులకు, స్నేహితులకు పూర్తిగా దూరమైపోయానని అనుపమ ఎమోషనల్ అయ్యారు. ఆ బంధంలో ఉన్నంత కాలం ప్రతి క్షణం భయంతోనే బతికానని ఆమె తెలిపారు.

# పూనకాలు తెప్పిస్తోన్న 'కాకా' టైటిల్ గ్లింప్స్

బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో సంచలన విజయం సాధించిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతోంది. ఈ చిత్రంలో అనస్వర రాజన్, నివేథా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ 'మెగా-158' నుంచి మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బిగ్ అప్‌డేట్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా (ఆగస్ట్ 22న) వచ్చేసింది. ఈ సినిమాకు 'కాకా' అనే వింటేజ్ అండ్ పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ గ్రాండ్‌గా టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ సెన్సేషన్ థమన్ ఎనర్జిటిక్ సంగీతాన్ని అందిస్తున్నారు. విడుదలైన గ్లింప్స్ విషయానికి వెళితే.. ఆక్వా రంగానికి చెందిన 'కె. సత్యం' అనే సూపర్‌వైజర్‌గా చిరంజీవి ఎంట్రీ ఇచ్చే సన్నివేశంతో వీడియో ప్రారంభమవుతుంది. చెన్నై టీమ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ లోడ్ సకాలంలో చేరుతుందని భరోసా ఇవ్వడం, పండుగ టార్గెట్ పేరుతో సునీల్ అడిగిన లీవ్ తిరస్కరించడం లాంటి నేచురల్ సీన్స్‌తో కథపై ఆసక్తి పెరుగుతుంది. గెటప్ శ్రీను విసిరిన స్కూటర్ కీస్ నీటిలో పడిపోగా, ఓ కుక్క తెచ్చిన రిమోట్ మాగ్నెట్ సాయంతో వాటిని తీసే క్రమంలో లోపలి నుంచి తుపాకులు బయటపడడం ఊహించని ట్విస్ట్ ఇస్తుంది.




# ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చిన 'కాటాలన్'..



మలయాళంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'కాటాలన్'. ఇందులో ఆంటోనీవర్గీస్, సునీల్, దుషారా విజయన్, కబీర్ దుహాన్ సింగ్, జగదీష్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. పాల్ జార్జ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని షరీఫ్ ముహమ్మద్ నిర్మించారు. రవి బస్రూర్, అజనీష్ లోకనాథ్ సంగీతం అందించారు.

ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కాటాలన్' తాజాగా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది.

ప్రముఖ ఓటీటీ వేదిక 'మనోరమా మ్యాక్స్‌లో' ఈ సినిమా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. మలయాళంతో పాటు తమిళం, కన్నడ భాషల్లోనూ ఈ చిత్రాన్ని ఓటీటీలో అందుబాటులోకి తీసుకువచ్చారు. యాక్షన్, క్రైమ్ అంశాలతో తెరకెక్కిన 'కాటాలన్' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.

# నచ్చకపోతే డబ్బులు వాపస్



రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'పాంచాలి పంచభర్తృక'. దర్శకుడు గంగ సప్తశిఖర. రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్ బ్యానర్స్ పై వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ), రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మించారు. ఈ నెల 14న ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ గంగ సప్తశిఖర మాట్లా డుతూ,'మా సినిమా ఆద్యంతం మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేస్తుంది. దర్శకుడు గంగ సప్తశిఖర. రాయల్ థ్రోన్ ప్రొడక్షన్స్, ఓం సాయిరాం ఆర్ట్స్ బ్యానర్స్ పై వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్ఏ), రాజ్ పవన్ శ్రీకాంత్ సెట్టివారి, సాయినాథ్ మణ్యం నిర్మించారు. ఈ నెల 14న ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com